# కలిసిన సమాంతర రేఖలు



రాఘవయ్య అరుగుమీద అటూ ఇటూ పచార్లు చేశారు.

ఒక్కోసారి తల నిలువునా ఆడించారు. దీర్ఘంగా నిట్టూర్చారు.

మరోసారి పళ్లు పటపట కొరికారు. ఆయన శరీరం అంతా కంపించిపోతున్నట్టనిపించింది.

మధ్యమధ్య చేతిగడియారం చూసుకున్నారు.

'ఎనిమిదిన్నర అయింది! ఇంకో గంటకు వస్తాడన్న మాట!' అని గొణుక్కున్నారు. చేతిలోఉన్న టెలిగ్రాం మరోసారి చదువుకున్నారు.

"రేపు ఉదయం బండికి వస్తున్నా. స్టేషనుకు ఎవరు రానక్కర్లేదు. రవణ."

ఒళ్లు భగభగమంది.

కటికచీకటిని చూసి గజగజలాడి ముడుచుకు పోయిన గులాబీలు, మల్లెలు అభయహస్తం ఇచ్చిన భాస్కరుడి కిరణపుంజాల్ని ముద్దుగా ముద్దుపెట్టు కుని, ఎర్రగా, తెల్లగా, నిర్మలంగా నవ్వాయి. వాటిని తాకి చల్లదనం ఆస్వాదించిన గాలి, రాఘవయ్యను ఎదుర్కొని, వేడికి ఆగలేక పైపైకి పరిగెత్తింది.

'అసలు వీణ్ణి రమ్మన్నదెవరు? . . .'

'ఇంకెవరు? ... ఆ గీతే అయిఉంటుంది' అని సమాధానం చెప్పుకున్నారు. గీతను అడగవచ్చు. కాని నిజం బయటపడదు.

"నాకేం తెలుసు నాన్నారూ! ఏమైనా కన్న కొడుకు కదా! తల్లి మంచం ఎక్కటం దానంతట అదే తెలుస్తుంది" అని లెక్చరు మొదలు పెడుతుంది. రాఘవయ్య టెలిగ్రాంమీది అడ్రసు చూశారు. సీతమ్మపేర వచ్చింది. 'అవును మరి. . . తండ్రికితగ్గ కొడుకు. వాడికిమాత్రం పౌరుషం ఉండదూ? . . .' ఆయన ఆలోచించేది రవణ రాకను గురించి కాదు.

'తన అభిప్రాయం తెలిసిఉండికూడా, అనుమతి లేకుండా అతన్ని పిలిచిం దెవరు? ఆ గుండెదిటవు ఎవరికుంది? ఈనాటివరకు ఎవరు తను గీచిన గీటు దాటలేదు. కాదు. . . కాదు. రవణ ఎప్పుడో తనను తోసిరాజన్నాడు. ఇంతకు తనకు, అతనికి ఉన్న అనుబంధం ఏమిటి? ఏమీలేదు.'

కాళ్లు నెప్పిపుట్టాయి గామోలు! అరుగుమీద్ది పడకకుర్చీలో కూర్చున్నారు. తోటమాలి క్రోటను మొక్కలు కత్తిరించి అందానికి వన్నెలు దిద్దుతున్నాడు. అవధి మించితే అదుపులో ఉంచక తప్పదు.

రవణ విషయంలోకూడా ఆయన అదే ప్రయత్నించారు. కాని ఫలితం మరోవిధంగా పరిణమించింది.

రాఘవయ్య స్వయంశక్తివల్ల జీవితంలో పైకి వచ్చినవారు. తండ్రిదగ్గరనించి ఒక్కపైసకూడా ఆస్తిగా కలిసి రాలేదు. ఇష్టంలేకపోయినా, అవసరానికి ఆదుకుంటుందని ఓ చిన్న ఉద్యోగం వెలిగించారు. వ్యాపారంలో ఆయనకు అంతులేని మోహం. కొందరికి కొన్ని విద్యలు ఎవరి సాయము, తరిఫీదు లేకుండా పుట్టుకతోనే వస్తాయి. రాఘవయ్య విషయంకూడా అంతే. ఉద్యోగంలో ఉంటూ చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు. ఎక్కువగా చలామణీ అయ్యే వస్తువులు ఒక్కుమ్మడిగా కొని, తెలిసిన వారందరికీ రొఖ్ఖానికి, అరువుకు అమ్మేవారు. కొద్దో గొప్పో లాభం వచ్చేది. కాలక్రమంలో గుడిసె పెంకుటిల్లయింది. పదిహేను సంవత్సరాల తరవాత అది బ్రహ్మాండమైన భవంతిగా మారింది.

రాఘవయ్య ధనికుల జాబితాలో చేరిపోయారు.

అన్నమాట నిలబెట్టుకోటం ఆయనలో గొప్పతనం. తనకు ఎదురుతిరిగినవారిని ఆయన ఎన్నడు క్షమించి ఎరగరు. వెలివేసేవారు. కన్నకొడుకుకూడా ఈ నిబంధనకు తలి ఒగ్గవలసివచ్చింది.

రాఘవయ్య కొడుకు రవణ. కూతురు గీత. గీత ఇరవయ్యోఏట బి. ఎ. పూర్తిచేసి పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లిపోయింది. రవణకు, వ్యాపారానికి వెయ్యిఆమడల దూరం. . . . ఎం. ఎ. పాసై ఓ కంపెనీలో మేనేజరుగా ఉన్నాడు. రాఘవయ్య తృప్తిగా నిట్టూర్చారు. మహాలక్ష్మిలా ఇంటికి కోడలు వచ్చి మంచితనం కురిపించటంమాత్రం మిగిలింది.

ఇక్కడ సీతమ్మనుగురించి కొంచెం చెప్పాలి.

ఆమెకు యాభైఏళ్లు నిండాయి. కాని చూడ డానికి అరవైఏళ్లు దాటినట్టుగా ఉంటుంది. అప్పు డప్పుడు ఆయాసం వచ్చేది. భర్త ఏమంటే అదే ఆమెకు వేదవాక్యం. నలుగురూ నవ్విపోతారని ఊరు కుందికాని, లేకపోతే దేవుడి విగ్రహం గిరవాటేసి ఆ స్థానంలో భర్తను ప్రతిష్ఠించి పూజించేది. ఏ విషయంలోను ఆమెను రాఘవయ్య సలహా అడగటం అంటూ ఉండదు. ఆయన శాసించటం, ఆమె శిరసా వహించటం — ఇదీ వరిపాటి. పిల్లలిద్దరూ ఒకే కడుపున పుట్టినా, రవణ అంటే ఆమెకు ప్రేమ ఎక్కువ. అందుకు ఆకాశంకూడా అవధి కాదు. ఎలాగూ ఒకరి సొత్తు కావలిసివస్తుంది కదా అని గీతమీద్ది అనురాగాన్ని ప్రయత్నపూర్వకంగా తగ్గించుకుందేమో!

రాఘవయ్య కొడుక్కి ఓ చక్కటి సంబంధం తీసుకువచ్చారు.

**ఆర్. యం. చిదంబరం**

అమ్మాయి అప్సరసలా ఉంది. వినయవిధేయతలు ఆమెకు సవినయంగా సలాం చేశాయి. బి. ఎ. చదువు కుంది. అమ్మాయి తండ్రి రూపాయినోట్లకు బదులు బంగారుకాసులు దొర్లించటానికి సిద్ధం. అగ్నిలాంటి వంశం. ఇంతకంటె ఏం కావాలి? అమ్మాయి రవణను చూడలేదుకాని, ఆమెతండ్రి, అన్న ఎన్నోసార్లు చూశారు. తనకు కాబోయే భర్తను పరీక్షించినమీదట ఒప్పుకోవాలన్న పట్టింపు లేదు. సరేనని తల ఆడించింది. రాఘవయ్యగారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తాము వేసుకున్న పథకాలన్నీ ఆటంకం లేకుండా నెరవేరినట్టే! ఇక హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. కట్నాలు, కానుకలు వగైరాలు నిర్ణయించిన పిదప పెళ్లిమాట సీతమ్మ చెవిలో వేశారు.

"ఏమిటి నీ అభిప్రాయం?" అని అడిగారు.

సీతమ్మ ఆశ్చర్యపోయింది. రెండు నిమిషాలవరకు నోట మాట రాలేదు.

ఏ విషయంమీదా ఆమెకు ఓ అభిప్రాయం అంటూ ఉన్నట్టు ఆయన అడిగేదాకా ఆమెకు తెలియనే లేదు.

"అలా గుడ్లగూబలా చూస్తున్నావేం? కొడుకును కన్నతల్లివి కదా! ఈ విషయంలో నీ మనస్సు తెలుసు కుందామని అడిగాను. నా అభిప్రాయానికి వ్యతి రేకంగా నువ్వేదైనా అంటే నేను ఒప్పుకుంటానని కాదు. ఏదో అడగాలి కదా అని అడిగాను. అంతే!"

"అమ్మాయికి అబ్బాయి నచ్చాడా?"

"ఆహా! నూటికి రెండువందలపాళ్లు."

"అబ్బాయికి?"

"ఈ చక్కనిచుక్కను ఎవరు వద్దంటారు?"

"మీమాట నిజమే! అయినా ఈ కాలంలో కుర్రాళ్ల మనస్సులు ఎలా ఉంటాయో ఎవరూ చెప్పలేరు. అందుచేత రవణ అమ్మాయిని తన కళ్లారా ఓమాటు చూసి సరేనంటే మంచిది."

రాఘవయ్య పెద్దగా నవ్వారు.

"నువ్వు వట్టి అమాయకురాలివి! నా మాటకు వాడు ఎదురుచెప్పగలడా? అదీకాక, కాదనేందుకు ఎలాంటి సాకులూ దొరకవు. ఈ సంబంధం నిండుకుండలాంటిది" అని కదిలిపోయారు.

సీతమ్మ నిట్టూర్చింది. ఎందుకో ఆమెకు కొద్దిగా భయం వేసింది.

ఏనాడు లేనిది రాఘవయ్య పెళ్లి స్థిరపరిచినట్టు కొడుక్కి రాసిన ఉత్తరం భార్యకు చదివి వినిపించారు. ఇంకా పదిహేనురోజుల్లో ముహూర్తం నిర్ణయించ వలసిఉంటుందికనక, వెంటనే సెలవు తీసుకుని బయలు దేరి రమ్మన్నారు. పెళ్లికి కావలసిన నూట్లు వగైరాలకు అర్డరిచ్చి, పోస్టులో పంపడానికి ఏర్పాటుచేస్తే చాలని, దానికోసం ఆగనక్కరలేదని శాసించారు.

రాఘవయ్య అడుగుల చప్పుడు విని లేచి నిలబడ్డారు.

గీత మెడిసిన్ చెస్ట్ పట్టుకుని ముందుకు వచ్చింది. డాక్టరు వెనకాల వచ్చాడు.

"ఎలా ఉందండి?" అని అడిగారు.

"అలాగే ఉంది. అసలు ఆమెకున్న రోగమేమిటో అంతుచిక్కటంలేదు, ఆయాసంగా ఉందంటారు."

"నిన్న రాత్రి అంతా పలవరించింది" అంది గీత.

"అవును. ముద్దుల కొడుకును చూడాలని. . ." అన్నారు కసిగా రాఘవయ్య.

"అయినా, రాఘవయ్యగారూ! మీకింత పట్టింపు పనికిరాదండీ! కుర్రతనంలో చేసిన తప్పులు తప్పులు కావండీ. అది వెలుగూ చీకటీ కాని సంధ్యలాంటిది. ఆ సమయంలో కనిపించే పంచరంగులు నిజమనుకునే వయస్సు. పెద్దలు క్షమించి మరిచిపోవాలి. ఒక్కసారి అతన్ని పిలిపించండి. కొడుకుని చూడగానే ఆమె అమాంతం లేచి కూర్చుంటుందన్న నమ్మకం నాకుంది" అన్నాడు డాక్టరు.



సమానంగా పూజించిన ఆ తల్లికీ, శుష్కించి, ఎముకలు, చర్మం తప్పించి మరేమీ లేని ఈ తల్లికీ పోలిక ఎక్కడ ఉందో అతని కర్థం కాలేదు. పాతాళంలోకి చొచ్చుకు పోయిన కళ్ళు ఆనందబాష్పాలు రాల్చాయి.

"అమ్మా!" అంటూ మంచం వారగా కూర్చున్నాడు.

సీతమ్మ చేతిని తడివి చూసింది. ఆనందాతిరేకంతో కొంతసేపటివరకు ఆమె నోటంట మాట రాలేదు. కొడుకువంక అలా నిశ్చితంగా చూస్తూ ఉండి పోయింది. ఉన్నట్టుండి ఆ కళ్ళు అటూ ఇటూ కదిలి దేనికోసమో వెదికాయి.

"నాయనా! కోడలు రాలేదూ?"

రవణ నవ్వాడు.

"కనీసం గోపినన్నా తీసుకురావలిసింది, అన్నయ్యా! నువ్వుకూడా ఓ మొండిఘటానివి! అదిసరే కాని నేను టెలిగ్రాం ఇచ్చినట్టు నాన్నతో చెప్పకు సుమా!"

"గీతా! నువ్వు వట్టి అమాయకురాలివి! ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే నాన్న ఈమాత్రం ఊహించలేడంటావా? . . తెలిసినా నువ్వెందుకు భయ పడాలి? మనిషికి అంతరాత్మ తప్పించి ఆత్మీయులు లేరు. అది కల్మషానికి, కోపతాపాలకు దూరమైంది; స్వచ్ఛమైన వెలుగులాంటిది."

సీతమ్మ లేచి కూర్చోటానికి ప్రయత్నం చేసింది.

"అబ్బాయిగారూ! వేన్నీళ్ళు రెడీ! స్నానానికి రండి!" అన్నాడు వెంకన్న.

● ● ●

రవణ స్నానం చేసి, కాఫీ తాగి మంచందగ్గిర స్టూలుమీద కూర్చున్నాడు.

మరో చుట్ట అంటించి రాఘవయ్య అరుగుమీద నుండి కదలలేదు.

"రవణా! నిన్ను ఓ వరం అడుగుతాను. లేదనకుండా ఇస్తావా?"

"నేను నీకు వరం ఇవ్వటమేమిటమ్మా?" అని నవ్వాడు రవణ.

"మీ నాన్న తనకు కొడుకు లేడన్నారు. నువ్వైనా నీ పంతం వదులుకుని, ఆయనదగ్గిర క్షమాపణ వేడుకో. నువ్వు మళ్లీ దూరమైతే నేను బతకలేను. నిన్ను నవమాసాలు మోసి, కని పెంచినందుకు ఈ మాత్రం ప్రత్యుపకారం చేయటం నీ విధి కాదా?"

"అవునన్నయ్యా! అమ్మ మాట అక్షరాలా నిజం!" అని సమర్థించింది గీత.

రవణకు ఏం సమాధానం చెప్పాలో తెలిసిందికాదు.

"సీతా! అనవసరంగా మాట్లాడి ఆయాసాన్ని కొనితెచ్చుకోకు. ఎక్కువగా మాట్లాడకూడదని డాక్టరు ఎన్నిసార్లన్నాడు! నువ్వు కొంచెమైనా శ్రద్ధగా ఉండటంలేదు."

రాఘవయ్య గుమ్మందగ్గిర నిలబడి హుంకరించాడు.

"అంటే, మన సంభాషణ అంతా విన్నారన్నమాట" అని గీత రవణ చెవిలో గుసగుసలాడింది.

"నా మనస్సు మారుతుందని, తప్పు ఒప్పుగా ఒప్పు కుంటానని ఎవరైనా అనుకుంటే అది కేవలం భ్రమ!" రాఘవయ్య శూన్యంలోకి చూస్తూ అన్నారు.

రవణ మాట్లాడకుండా మేడమీదికి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం డాక్టరు పరీక్షచేసి చూశాక, "అప్పుడే కొంచెం నయమైనట్టుందండి. నేను ముందే అన్నానుగా, ఈ పొడుపు కథకు జవాబు రవణదగ్గిర ఉందని" అన్నాడు.

తల్లికి కావలిసిన సపర్యలన్నీ కొడుకు, కూతురు ఏ లోపమూ లేకుండా చేశారు. సరదాగా కబుర్లు చెబుతూ ఆమె చుట్టూ తిరిగేవారు. సీతమ్మ నిండుగా నవ్వినా, అది గాలిబుడగలా ఎంతోకాలం నిలవదని బెంగ పడుతూనేఉంది. పదిరోజులు పోయాక కొద్దిగా లేచి తిరగటం మొదలుపెట్టింది. ఆమె పూర్తిగా కోలు కుందని డాక్టరుకూడా అభిప్రాయపడ్డాడు.

"అమ్మా! పదిగంటల బండికి వెడుతున్నా!" అన్నాడు రవణ.

సీతమ్మ పిడుగుపడ్డట్టు మంచంమీద కూలబడింది.

"తండ్రిగుణాలన్నీ నీకూ వచ్చాయి. ఏం చెయ్యను? నా ఖర్మ. నిన్ను ఆపలేనని తెలుసు. అయినా మరో వారం రోజులుండి పోవచ్చుగా!" అని బతిమాలింది.

"అప్పుడు అనుబంధం మరింత బలపడి, ఎడబాటు అసహనీయంగా ఉంటుంది. వద్దమ్మా!" అని ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండా బట్టలు అవీ సర్దుకునేందుకు మేడమీదికి వెళ్లాడు.

సీతమ్మ గీతను పిలిచింది.

"అమ్మాయ్! నీతో ఓ సంగతి చెప్పాలి! అలా పెరట్లోకి రా!" అంది.

గీత తల్లి ననుసరించింది. తల్లీ, కూతురూ అరగంట ఏవో గుసగుసలాడుకున్నారు.

గీత తిన్నగా వెళ్లి తండ్రిముందు నిలబడింది.

రాఘవయ్య చదువుతున్న పుస్తకం మూసి "ఏం కావాలమ్మా?" అని అడిగారు.

"నాన్నారూ! న్యాయమనేది అందరికీ ఒక్కటేనా? లేక వ్యక్తుల్నిబట్టి మారుతుందా?" గీత గంభీరంగా ప్రశ్నించింది.

రాఘవయ్య కనురెప్పలు రెండుసార్లు పైకీ కిందికీ కదిపి అర్థపూరితంగా నవ్వారు.

"అమ్మాయ్! నువ్వు అడగరాని ప్రశ్నలు అడుగు తున్నావు."

"మీకు బాధగా ఉంటే క్షమించండి. కాని అడగవలిసిన సమయం వచ్చింది కనక అడగక తప్పదు. మీ ఇష్టం లేకుండా ఆస్తిపాస్తులు లేని అమ్మాయిని అన్నయ్య చేసుకున్నాడని బంధాన్ని తెంపివేశారు! మిమ్మల్ని అవమానించాడు. నలుగురిలో తలవంచు కునేటట్టు చేశాడు. అంతా నిజమే! కాదనను. కాని, తన తప్పు సరిదిద్దుకోవాలంటే అతను నమ్మించి పెళ్లి చేసుకున్న ఓ అనాథను వదిలించుకోవాలి. మీరు నిర్ణయించిన వధువు మెడలో మూడుముళ్ళు వేయాలి. అప్పుడతను మీ కొడుకవుతాడు. అంతేనా?"


రాఘవయ్య కొంచెం ఆశ్చర్యపోయినా చలించలేదు.

"నీ మాటల్లో కొంత నిజం ఉండవచ్చు. కాని తప్పు చేసినవారు శిక్ష అనుభవించక తప్పదు. తప్పుల్లో కూడా, చెరిపివెయ్యలేనివి కొన్ని ఉన్నాయి. నీ అన్న అలాంటి తప్పే చేశాడు."

గీతకు సహనం నశించింది.

"ఒకవేళ అతని తండ్రే అలాంటి తప్పు చేసి ఉంటే?..."

ఆ ప్రశ్న వేసిన తరవాత గీత గజగజలాడింది.



నటరాజస్వామి

ఫోటో—ఎస్. షా అలీ (హైదరాబాద్)

చండశాసనుడైన తండ్రిముందు అంత ధైర్యంగా ఆమె ఎన్నడు మాట్లాడి ఎరగదు. ఏదో అజ్ఞాతశక్తి ఆమె నందుకు ప్రోత్సహించింది.

"గీతా! నువ్వు చెప్పదలుచుకున్నది డొంక తిరుగుడుగాకాక, నేరుగా చెప్పు."

"మీరు చేసిన పనిమాత్రం సరైనదా? అని అడుగుతున్నాను. అంతే!"

"నోరుముయ్! నన్ను అడిగేందుకు నీకు ధైర్యం ఎక్కణ్ణించి వచ్చింది? వెళ్లి నీ పని చూసుకో. అధికప్రసంగం వద్దు" అని గద్దించారు.

గీత మారుమాట్లాడకుండా వెళ్లిపోయింది. ఆమె ముఖంలోమాత్రం ఎందుకో తృప్తి చిన్న వెలుగుగీతలా కనపడింది.

రాఘవయ్య అటూ ఇటూ పచార్లుచేయ నారం భించారు. ఎవరో ఆయన గుండెలో కత్తితో లోతుగా పొడిచినట్టయింది. గుండె పిండుతున్నట్టుంది. కళ్ళు రెండు ఎర్రరంగు పూసుకుని బూచీలలా భయ పెట్టాయి.

గీత ఎంత మాటంది!

బోనులో ఖైదీలా విలబెట్టి నిలదీసి కత్తిరించినట్టు అడిగింది. ఆమె 'మాటల్లో' నిజానిజాలు ఎలా ఉన్నా తన్ను ధిక్కరించటం ఆయన సహించలేకపోయారు.

'అంటే సీత నా కిచ్చిన మాట కాపాడలేదన్నమాట! కన్న సంతానంముందు నాకు తలవంపులు తెచ్చింది' అని మథనపడ్డారు.

సీతను సంజాయిషీ అడగాలి. మౌనంగా ఉండ కూడదు.

రాఘవయ్య గబగబా లోపలికి వెళ్లారు. అక్కడ తల్లికి చెరోపక్కా కొడుకు, కూతురు ద్వారపాలకుల్లా నిలబడ్డారు. తిరిగి తన గదికి వచ్చారు.

'ఇంతకూ గీత అన్న మాటల్లో తప్పేముంది? ఎక్కడో, అనంతంలో దీనది ఆర్తనాదంలా అంతరాత్మ చిన్నగా సన్నగా వినిపించినట్టు ప్రశ్నించింది. కామక్రోధాదులతో నిండిన మనస్సు ఎదిరించలేపోయే సరికి మరికొంచెం గట్టిగా, రాఘవయ్యకు స్పష్టంగా

26—7—67

వినిపించేట్టు తిరిగి అడిగింది.

వెనక్కి తిరిగి నడిచారు.

అప్పు డాయనకు పాతిక సంవత్సరాలు. ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం. పట్నంలో ఒంటరిగా చిన్న గది తీసుకుని ఉండేవారు. అంద్రి తీరితవులు ఆ జాతకు అలవాటులతో ఉన్నా, "ఉద్యోగం పురుషలక్షణం" అన్న సామెతకు న్యాయం చేకూర్చాలనుకున్నారు. ఐదేపంతులు పరమానందం ఇంట్లో భోజనం. నెలకు ఇంతని ఇచ్చేవారు. పరమానందం కూతురు సీత అందంగా అమాయికంగా ఉండేది.ఏడో తరగతిలో చదువు మానుకుంది. ఆమె అందాన్ని దోచుకునేందుకు ఎందరో పొంచిఉండేవారు. పరమానందం భయపడి అత్యవసర మైతేతప్ప కూతుర్ని గడప దాటనిచ్చేవాడుకాడు. ఒక్క రాఘవయ్యకు మాత్రం ఆమెతో మాట్లాడ్డానికి పూర్ణస్వాతంత్ర్యం ఉంది. పరమానందానికికూడా ఆయనంటే ఎంతో అభిమానం, గౌరవం, ప్రేమ. రాఘవయ్య ఆదివారాలు, తతిమా సెలవురోజులు పరమానందం ఇంట్లో ఉండిపోయే వారు. సీతతో కబుర్లు చెప్పటం, ఆమెను ఉడికించి ఏడిపించటం పరిపాటి. అలా స్నేహం ఓ మెట్టు పైకి వెళ్ళింది. దాన్ని ప్రేమించటం అనండి, మరే మైనా అనండి. సీతను చూడకుండా, ఆమెతో మాట్లాడకుండా ఒక్కరోజుకూడా గడపటం సాధ్యం కాదన్న స్థితికి రాఘవయ్య వచ్చారు. చాలాకాలంవరకు పరమానందానికీ పరివర్తన తెలియదు. తెలిశాక సీతను మందలించారు.

"అతను శ్రీమంతుడు. అంటే మనలాంటి పేదలకు గర్భశత్రువు. అగ్నితో చెలగాటం తగదు. అతన్ని గౌరవించి సత్కరించవలసిందే — కాదనను. కాని అవధి దాటకూడదు. జాగ్రత్తగా ఉండు."

సీత మౌనంగా ఉండిపోయింది. మంచికీ, చెడుకు ఉన్న విభేదం ఆమెకు తెలిసిందని పరమానందంకూడా ఆ సంగతి మరిచిపోయి ఊరుకున్నాడు. ఆ అభిప్రాయం పొగమంచులా కరిగేందుకు ఎంతోకాలం పట్టలేదు. ఉన్నట్టుండి ఇద్దరు ఒక్కసారిగా ఆ ఊరినుండి మాయమయ్యారు. తరవాత పారంరోజులకు పరమా నందానికీ, రాఘవయ్య తండ్రికి ఒకే ఊరునుండి, ఒకే సమయంలో, ఒకే వ్యక్తి రాసిన రెండు ఉత్తరాలు అందాయి. "దేవుడిముందు మేం పెళ్ళి చేసుకున్నాం. ఆశీర్వదించండి" అని వాటి సారాంశం.


పరమానందం బాధపడ్డా, మనస్సుకు ధైర్యం చెప్పుకున్నాడు.

రాఘవయ్య తండ్రిమాత్రం తన కొడుకు చని పోయాడని ప్రకటించి, ఆ సంగతి కొడుక్కికూడా తెలియజేసి, ఆఖరి గడియల్లో తన ఆస్తి అంతా దేవుడికి సమర్పించి కన్ను మూశాడు.

రాఘవయ్య సీతను మరింత అనురాగంతో ఆద రించారు. తలిదండ్రులకు తెలియకుండా లేచివచ్చి పెళ్ళి చేసుకున్న సంగతి ఎవరికీ తెలియనివ్వనని సీతచేత ప్రమాణం చేయించారు. ఆ మాటను ఈనాటివరకూ సీత వేలవేపి విధిలా కాపాడింది.

కాని, ఈనాడు?

అగ్నిపర్వతం బద్దలైంది!



ఢిల్లీ జూలో కొంగల దినఫలం

ఫోటో — సుశీల్ భారతి (కిరండల్)

సీతతో సహనం నశించింది. తన జీవితరహస్యం బయటపడింది. కొడుక్కీ, కూతురుకూ తన ముఖం ఇప్పు డెలా చూపించటం? రవణ చేసిన పనికి తనెంత బాధపడ్డాడో, అలాగే తన తండ్రికూడా కుంగి పోయిఉండాలి. అయినా ఆనాడు తను తప్పు చేశానని పసేమిరా ఒప్పుకోలేదు. ఇప్పుడు రవణ తప్పు చేశాడని, అందుకు ప్రాయశ్చిత్తంకూడా లేదని తను శాసనం వ్రాశారు. తనకు మళ్ళే అతనుకూడా మనసుకు నచ్చిన మగువను వరించాడు.

రాఘవయ్య రెండుచేతులతో తల పట్టుకుని కూర్చున్నారు. ఆయన గుండెలో పెనుగాలి వీస్తూంది. కొండలు, గుట్టలు, నదులు, భవనాలు అన్నీ ఆ గాలికి ఎగిరి దూరదూరాలకు పరిగెడుతున్నాయి. ఆ మహావేగానికి తమ తమ రూపాల్నికూడా పోగొట్టు కున్నాయి. అయితేనేం? అవన్నీ సజీవమైనవి కనక మరోరూపంలో మరోదేశంలో నిలిచిపోతాయి. తుపాను అంతమయ్యాక మరో అందమైన చోటు వెలుస్తుంది.

'అంటే నేను వట్టి మూర్ఖుణ్ణేనా?' అని ప్రశ్నించుకున్నారు.

"అవును!" అని అంతరాత్మ ఆకాశమంత గొంతుకతో అరిచింది. మనస్సు పిరికిపందలా పరిగెడుతూ "ఓడిపోయావు" అంది.

వీధిలో బండి వచ్చింది,

రవణ సూట్కేసు అందుకుని ఉన్నాడు.

సీతమ్మ గిలపాయంతో గుమ్మం దగ్గరికి వచ్చి నిలబడి దీనంగా చూసింది.

'మళ్ళీ ఎప్పుడు కనిపిస్తాడో! అసలు చూసే యోగం ఉందో లేదో!' అని పరితపించింది. మొదటి సారిగా భర్త అంటే అసహ్యంవేసిందికూడా.

"వస్తానమ్మా! జాగ్రత్తగా ఉండు. నాకోసం అనవసరంగా బెంగపెట్టుకోకు. అందువల్ల ఏమీ లాభంలేదు. గీతా! అమ్మకు కొడుకు, కూతురు అన్నీ నువ్వే."

గీతకికూడా దుఃఖం ఆగిందికాదు. వెక్కివెక్కి ఏడ్చింది.

తండ్రి మనస్సును మార్చగలిగిందేమోనన్న భ్రమకు ఇప్పుడు పునాది లేదు. ఆయన మారరు. అది బండరాయి.

రాఘవయ్య తన గదిలోంచి బయటపడి అరుగు మీదికి వచ్చారు.

"వెంకన్నా!" అన్నారు గంభీరంగా.

వెంకన్న మెరుపులా వచ్చి వాలాడు.

"ఆ సూటుకేసు లోపల పెట్టు" అన్నారు.

వెంకన్న కొంచెం వెనకాడాడు.

"చెప్పిన పని వెంటనే చెయ్యి!" అని గద్దించారు.

తతిమా ముగ్గురూ అయోమయంగా చూశారు.

వెంకన్న సూట్కేసు అందుకున్నాడు.

"అబ్బాయ్! నువ్వు ప్రయాణం మానుకో. అంతేకాదు, ఉద్యోగంకూడా మానుకో. నేనూ, మీ అమ్మా ముసలివాళ్ళమవుతున్నాం. మాకు సాయంగా ఉండవద్దూ. డబ్బు లేకుంటే ఉండకూడా ఒక్కగానొక్క కొడుకును ఎవరైనా మరోఊరికి ఉద్యోగంకోసం పంపుకుంటారా? ఇంటిలో అలోచించి నిర్ణయించ లేందుకు ఏమీలేదు. ఇది నా శాసనం. పద" అని తుదితం చెప్పారు.

ముగ్గురూ అలా ప్రతిమల్లా నిలబడ్డారు! ★